ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వ్యాపారులు, హోటల్స్ నిర్వాహకులు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని డిఎస్‌పి మహేంద్ర హెచ్చరించారు. శనివారం పట్టణంలోని బెంగుళూరు బస్టాండ్, సిటిఎం రోడ్డు తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులతో కలిసి డిఎస్‌పి పర్యటించారు. దుకాణాలు, హోటళ్లు, బస్టాండ్ల వద్ద నిలిపిన వాహనాలను గుర్తించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఇబ్బంది కరంగా వాహనాలు నిలిపితే సంబంధిత వ్యాపారస్తులపై చర్యలు తప్పవన్నారు. పోలీసులకు సహకరించి నిబంధనలను పాటించాలని కావాలని సూచించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ ప్లేసులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. హోర్డింగ్‌లు రోడ్డుపై పెట్టడం, రోడ్లను అక్రమించి రేకులు ఏర్పాటు చేసుకోవడం తగదన్నారు. వారి వారి వ్యాపార సముదాయాల వద్ద నిర్వాహకులే ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించుకుని సమస్యలు లేకుండా తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని హితువు పలికారు.

కౌమార కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

బాలల, కౌమార కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ చర్యలు చేపట్టాలని, ఈనెల 1 నుండి 30 వరకు జిల్లా వ్యాప్తంగా టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ, పునరావాస ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో దేశవ్యాప్తంగా ఈనెల 30 వరకు చేపట్టనున్న బాలల, కౌమార దశ పిల్లల సంరక్షణ, పునరావాస ప్రచార కార్యక్రమం పై కార్మిక శాఖ, పోలీస్, విద్య, వైద్య తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ జిల్లా అధికారి రంగరాజు అన్నమయ్య జిల్లాలో జరగబోయే బాలల సంరక్షణ, పునరావాస ప్రచార కార్యక్రమాల గురించి పలు విషయాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణ, వారి పునరావాసమే ధ్యేయంగా జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ పని చేయాలని సూచించారు. బాలల సంక్షేమ కమిటీ సభ్యులు ఈ ప్రచార కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ కమిటీతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు శాఖ వారు టాస్క్ ఫోర్స్ కమిటీకి అన్ని రకాల సహకారాలు అందించి బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. చైల్డ్ లైన్ వారు ఎన్‌జిఒల సహకారంతో బాల కార్మిక వ్యవస్థ జిల్లాలో ఎక్కడెక్కడ ఉందో తెలియజేసి తగిన చర్యలు చేపట్టాలన్నారు. బచ్పన్ బచావో ఆందోళన సభ్యులు కమిటీకి అనే రకాల సహకారాలు అందివ్వాలని పేర్కొన్నారు. సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జిల్లా వివిధ పాఠశాలలలో డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల వివరాలు తెలియజేసి టాస్క్ ఫోర్స్ కమిటీ పునరావాస కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాలల, కౌమార కార్మిక వ్యవస్థ (నిషేధం, నియంత్రణ) చట్టం 1986, సవరణ చట్టం 2016 పై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రంగరాజు, పోలీస్ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధి కారులు, ఎన్‌జిఒల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం

- విధి నిర్వహణలో కరెంట్ షాక్‌కు గురైన జెఎల్‌ఎం బాలకృష్ణ
- ఎల్‌సి తీసుకున్న లైన్ కాకుండా మరో స్తంభం ఎక్కించడంతో ప్రమాదం
- ప్రాణాపాయ స్థితిలో జెఎల్‌ఎం
- కేసు నమోదు కాకుండా విఫలయత్నం చేసిన అధికారులు
- అధికారులను సస్పెండ్ చేయాలి : సిఐటియు

బాధితుడిని పరామర్శిస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

తీవ్రంగా గాయపడిన జెఎల్‌ఎం బాలకృష్ణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహించే బాలకృష్ణ అనే వ్యక్తి ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. విద్యుత్ స్తంభం ఎక్కాల్సిన డ్యూటీ తనది కాకపోయినా అధికారుల తీవ్ర ఒత్తిడి, నిర్లక్ష్యం కారణంగా స్తంభం ఎక్కి కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బాధితుని కథనం మేరకు నిమ్మనపల్లి మండలం సాకిబండవారిపల్లికి చెందిన రామనాథ్ కుమారుడు బాలకృష్ణ పిటిఎం మండలం, కందుకూరు సచివాలయంలో జూనియర్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పిటిఎం ఫీడర్ ఇన్సిలేటర్ బ్లాస్ట్ అవ్వడంతో లైన్ బ్రేక్ డౌన్ అయ్యింది. కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కరెంట్ మరమ్మతులు చేసే క్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ పిటియం 132/33 కెవి పిటిఎం ఫీడర్ ఎల్‌సి తీసుకున్నారు. జెఎల్‌ఎం బాలకృష్ణను వరికసువుపల్లి ఫీడర్ లైన్‌లో ఉన్న స్తంభాన్ని ఎక్కించారు. 33 కెవి లైన్ కావడంతో సాధారణంగా లైన్ బ్రేక్ అయితే ఎడిఇ, ఎఇ లైన్ క్లియరెన్స్ తీసుకొని వారి పర్యవేక్షణలో మరమ్మత్తు చేయాల్సి ఉంది. ఇవేమీ పట్టించుకోని లైన్ ఇన్‌స్పెక్టర్ రమణ తనే లైన్ క్లియరెన్స్ (ఎల్‌సి) పిటిఎం సబ్ స్టేషన్ 33 కెవిఎ తీసుకొని, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ జెఎల్‌ఎం బాలకృష్ణను ఎల్‌సి తీసుకోని వరికసువుపల్లిలోని మరో స్తంభాన్ని ఎక్కించడంతో ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన బాలకృష్ణను లైన్ ఇన్‌స్పెక్టర్ రమణ, సీనియర్ అసిస్టెంట్ గురు భాస్కర్, తదితర లైన్ మ్యాన్లు బాధితున్ని హుటాహుటిన మదనపల్లిలోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గుట్టు చప్పుడు కాకుండా చికిత్సలు అందించి ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా విఫల ప్రయత్నాలు చేశారు. తమను కాదని కేసులు అంటే మీరే చూపించుకోవాలని, ఏం జరిగినా మాకు సంబంధం లేదని కుటుంబ సభ్యులను బెదిరించారు. కేసు నమోదు కాకుండా విశ్వప్రయత్నాలు చేశారు. అధికారుల ఒత్తిడికి తలొగ్గిన కుటుంబ సభ్యులు తమ బిడ్డ బాగుంటే చాలనుకొని వారు చెప్పినట్లే విని ప్రయివేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు మొగ్గు చూపారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు అక్కడికి చేరుకొని మీ తప్పిదం లేకపోతే ఎందుకు ఎమ్మెల్సీ చేపించలేదని, దొంగ చాటుగా వైద్యం చేయించాల్సిన అవసరం ఏమొచ్చిందని, కుటుంబ సభ్యులను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. బాలకృష్ణకు జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బాలకృష్ణ కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడని, అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు చేయించగా బాధితుడు బాలకృష్ణకు ఎనిమిది ఎముకలు విరిగినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. తమకు న్యాయం చేయాలని బాధితుని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మనూజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజలకు ఇంటి వద్దే సేవలు అందించేందుకు ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని 19వ వార్డు కౌన్సిలర్ ఖాజా ఆరోపించారు. అందుకు నిదర్శనమే ఎనిమిది నెలలుగా సచివాలయ భవనాలకు అద్దె చెల్లించకపోవడమని కౌన్సిల్ సమావేశంలో నిలదీశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ వార్డులో జరుగుతున్న వివక్షపై గళం విప్పారు. ముందుగా 6వ వార్డు కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో వివక్ష జరుగుతోందని తద్వారా తమను ఎన్నుకున్న ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనగా తాను సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు చెప్పి వెళ్లిపోయారు. అనంతరం 33వ వార్డు కౌన్సిలర్ రమణ మాట్లాడుతూ తమ వార్డులో ఇంతవరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని నిలదీశారు. సమాధానంగా కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ ఇటీవల జరిగిన కొన్ని కాంట్రాక్టు వర్కులకు బిల్లులు పెండింగ్లో ఉండడంతో మిగతా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని అందువల్ల ఆలస్యం అవుతుందని త్వరలో అక్కడ కూడా అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. 19వ వార్డు కౌన్సిలర్ ఖాజా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు సేవలను సులభతరం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అప్పుడు సచివాలయంలో పది మంది ఉద్యోగులు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమ పథకాలు అందించారన్నారు. నేడు సచివాలయాలు కేవలం బిల్లు కలెక్టరుగా మారారే తప్ప ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదని ఆరోపించారు. మదనపల్లె మున్సిపాలిటీలో 42 సచివాలయాలు ఉండగా అందులో 27 సచివాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని అయితే వాటికి 8 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఆ భవన నిర్వాహకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే శాస్త్రి వీధిలోని సచివాలయంకు నాలుగు నెలల క్రితం తాళాలు వేయడం జరిగిందన్నారు. కేవలం సచివాలయాల్లో ఉద్యోగస్తులను పన్నులు కట్టించుకోవడానికి వినియోగిస్తున్నారు తప్ప ప్రజలకు సేవ అందించడంలో వెనుకబడిందని ఆరోపించారు. కమిషనర్ బదులిస్తూ సిఎఫ్ఎంఎస్ వల్ల సచివాలయ భవనాలకు అద్దెలు పెండింగ్‌లో పడ్డాయని త్వరలోనే వాటిని చెల్లిస్తామని తెలిపారు. మిగతా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇటీవల బహుదా కాలువ, డ్రెయినేజీ వ్యవస్థ పరిశుభ్రతకు సాధారణ నిధుల కింద రూ.40 లక్షలు కేటాయించడంపై నిలదీశారు. దీనిని సభ ఆమోదించిన తర్వాతే ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు అందకపోవడం పై ప్రశ్నించారు. వెంటనే వారికి జీతాలు చెల్లించాలని తెలిపారు. వారపు సంతలో రెండు నెలలుగా అక్రమ వసూళ్లు జరిగాయని, అక్రమ షెడ్లు, కరెంటు మీటర్లు ఉన్నాయని వీటిని నియంత్రించాలని పేర్కొన్నారు. వాటిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం : పిసిసి

ప్రజాశక్తి - రాయచోటి : టిడిపి కూటమి పాలనలో పాఠశాల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, భ్రష్టు పట్టిందని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విచారం వెలిబుచ్చారు. శనివారం రాయచోటిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల అని మూడు రకాల పాఠశాలలుండేవని, అందరికీ సౌకర్యంగా, సౌలభ్యంగా ఉండేవని చెప్పారు. వైసిపి పాలనలో శాటలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ప్రి హై స్కూల్, హైస్కూల్ అని రకరకాల పాఠశాలలు తెచ్చివిద్యార్థులను అయోమయానికి గురిచేశారని చెప్పారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక వూడిపోయింది అన్నట్లు టిడిపి కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యను 9 రకాలుగా విభజించి చీలికలు పేలికలుగా చేసిందిన్నారు. హై స్కూళ్లల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:40 బదులు 1:53 చేయడంతో ఫలితంగా 6,428 మంది ఉపాధ్యాయులు మిగులుగా తేల్చారన్నారు. 16347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డిఎస్‌సి ప్రశ్నార్థకమయిందిన్నారు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 85ను తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చిందిన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా జిఒను రద్దు చేయకపోగా మరింత పకడ్బందీగా అమలు చేస్తోందని వాపోయారు. కూటమి మాట తప్పిందన్నారు. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడం చారిత్రిక తప్పిదం అని దీని వల్ల ఎన్‌టిఆర్ ఆత్మ క్షోభిస్తుంది న్నారు. తెలుగు దేశం పార్టీ పేరును ఇంగ్లీష్ దేశం అని మార్చుకుంటే సరిపోతుంది అని ఎద్దేవా చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలన్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలలో, ఉద్యోగాలలో 3 శాతం అదనపు మార్కులు కలపాలని చెప్పారు. ఉన్నత విద్య లో ఉపాధ్యాయుల, విద్యార్థుల నిష్పత్తి 1:40 గా ఉండాలిన్నారు. మెగా డిఎస్‌సిని యధాతథంగా నిర్వహించి పాఠశాలలు తెరిచే లోపే ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లా బకష్, ఎస్.ఎం.డి గౌస్, దర్బార్, చెన్న కృష్ణ, మన్సూర్, సయ్యద్ అలీ, రఫీ, ఖాదర్, బాబా సర్దార్, ఇమ్రాన్, షబ్బీర్, ఖాదర్ ఖాన్, ఇంతియాజ్ అలీ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-పీలేరు : ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలను, 108 వాహనాల సేవలను అన్నమయ్య జిల్లా సమన్వయకర్త డాక్టర్ లోకవర్ధన్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల్లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్జరీలు జరిగేలా వైద్య మిత్రలు కృషి చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రోజూ వారీ ఓపి వివరాలు, వారిలో ఎంతమంది ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో నమోదు అయ్యారని ఆరా తీశారు. అనంతరం ఎన్టీఆర్ వైద్య సేవ వార్డులోని రోగులను కలసి వారికి అందుతున్న సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 108 అంబులెన్సును పరిశీలించి జాబితా ప్రకారం లాగ్ బుక్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య మిత్ర లక్ష్మి, 108 సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర పోరాటాలే సిఐటియు నినాదం

జెండా ఆవిష్కరిస్తున్న రవికుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : నిరంతర పోరాటాలే సిఐటియు నినా దమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవి కుమార్ తెలిపారు. సిఐటియు 55 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పురపాలక కార్యాలయం వద్ద జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించే విధంగా సిఐ టియు పోరాడుతోందని తెలిపారు. 1970లో పురుడు పోసుకున్న సిఐటియు ఈ 55 సంవత్సరాల కాలంలో కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల కోసం అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. రానున్న కాలంలో కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు, నాలుగు లేబర్ చట్టాలు రద్దు, ఇఎస్ఐ అమలు కోసం దేశవ్యాప్త ఆందోళనలు నిర్వ హించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సి పల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, ప్రసాద్, లక్ష్మీదేవి, ఎం.వి.రమణ, సాలమ్మ, సురేష్ పాల్గొన్నారు.

కరోనాపై ప్రజలు ఆందోళన చెందొద్దు

- డిఎంహెచ్ఒ డాక్టర్ ఉషశ్రీ

మదనపల్లెలో యువకుడి ఇంటివద్ద బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-రాయచోటి

కరోనాపై జిల్లా ప్రజలు ఆందోళన పడవద్దని, దానిని ఎదుర్కోవడానికి అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉన్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉషశ్రీ పేర్కొన్నారు. మదనపల్లి పట్టణానికి చెందిన యువకుడికి కరోనా పాజిటివ్‌గా తేలిందని చెబుతూ వాట్సాప్‌లో సర్క్యులేట్ అవుతున్న ఒక మెసేజ్‌పై స్పందించిన డిఎంహెచ్ఒ ఆ యువకుడికి ఆర్‌టిపిసిఆర్ టెస్టింగ్ తరువాతే కరోనాను నిర్ధారణ చేయగలుగుతామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకుడు తనకు జ్వరం కారణంగా ఎర్నాకులంలోని ప్రభుత్వ వైద్య ఆసుపత్రిలో టైఫాయిడ్, డెంగ్యూ, కోవిడ్, మలేరియా టెస్టులు చేయించుకోగా వైద్యులు కోవిడ్ లక్షణాలు ఏవి లేవని నిర్ధారించారని చెప్పారు. జ్వరం ఉండడంతో ఆయన హోం క్వారంటైన్ చేసుకోవాలని ఎర్నాకులం ఆసుపత్రి వైద్యులు సూచించారని పేర్కొన్నారు. అనంతరం యువకుడి చెల్లెలు ఆయన రిపోర్టులతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించగా ఆర్‌టిపిసిఆర్ టెస్ట్ కొరకు ఆసుపత్రికి తీసుకురావాలని, టెస్ట్ తర్వాత మాత్రమే కరోనాను నిర్ధారించగలమని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సూచించారని పేర్కొన్నారు. ఒకవేళ ఆ టెస్టులో పాజిటివ్‌గా వస్తే మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోనే కారంటైన్ చేయిస్తామని వైద్యులు తెలిపారని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు యువకుడితో మాట్లాడగా తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి వెళుతున్నానని, ఆర్‌టిపిసిఆర్ టెస్టు ద్వారా కోవిడ్ నిర్ధారణ అయితే సిమ్స్‌లోనే క్వారంటైన్ చేయించుకుంటానని అధికారులకు తెలియజేశారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. యువకుడు తన ఇంటికి రానప్పటికీ మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్యులు ఆయన ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యుల వివరాలను తీసుకొని కోవిడ్ ప్రోటోకాల్‌ని సూచించి, తగిన చర్యలు చేపట్టినట్లుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేర్కొన్నారు. జిల్లా ప్రజలు కోవిడ్‌పై ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా వైద్య యంత్రాంగం అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉందని ఉషశ్రీ పేర్కొన్నారు.

మదనపల్లెలో కరోనా పాజిటివ్ కేసు!

ప్రజాశక్తి-మదనపల్లె

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శనివారం కరోనా పాజిటివ్ కేసు వెలుగుచూసింది. మదన పల్లెలో ఇదే తొలి కేసుగా నమోదవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పట్టణానికి చెందిన ఓ నిరుద్యోగ యువకుడు ఇటీవల ఉద్యోగ వేటలో భాగంగా కేరళ రాష్ట్రానికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా ఆయనకు దగ్గు, జ్వరంతో ఆరోగ్యం విషమించింది. పరిస్థితి విషమించడంతో మదనపల్లెలో ఉండే అతడి సోదరికి సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి వెళ్లిన సోదరి, ఎర్నాకులంలోని మెడికల్ సెంటర్లో వైద్య పరీక్షలు చేయించగా కరోనా పాజిటివ్ అని తేలింది. తక్షణమే ప్రాథమిక చికిత్సలు అందించిన అనంతరం, తమ్ముడిని మదనపల్లెకు తీసుకొచ్చి హోమ్ క్వారెంటైన్‌లో ఉంచారు. అయినప్పటికీ కుటుంబ సభ్యులకు వ్యాపించే ప్రమాదం ఉండటంతో బాధితుడిని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాలని ఆయన సోదరి అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు కలెక్టర్, డిఎంహెచ్ఒల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సంబంధిత అధికారులు స్పందించాలని, తక్షణమే అవసరమైన వైద్య సేవలు కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేస్తున్నారు.

వాల్మీకిపురం నుంచి గ్లోబల్ వేదికకు..

- క్రికెట్ విశ్లేషణలో సంపత్ అసాధారణ ప్రయాణం

వీడియో అనలిస్ట్ సంపత్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం పట్టణం తోటవీధికి చెందిన శేషాద్రి ఆది నారాయణ, విజయలక్ష్మి దంపతుల కుమారుడు శేషాద్రి సంపత్ చిన్ననాటి నుంచే చదువుపై, క్రీడలపై తనకున్న ఆసక్తిని సమపాళ్లలో పంచుకుంటూ ఎదిగాడు. తన అసాధారణ విశ్లేషణాత్మక నైపుణ్యంతో అంతర్జాతీయ క్రికెట్ వేదికపై గొప్పస్థానం సంపాదించారు. సంపత్ ఆట గాడిగా కాకుండా, వీడియో, డేటా విశ్లేషణ నిపుణుడిగా క్రికెట్‌లో తనకం టూ ప్రత్యేక గుర్తింపు పొంది, విభిన్నమైన ఆవిష్కరణకు నాంది పలికాడు.

అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన విశ్లేషణ నైపుణ్యం

2023లో సంపత్ అమెరికా జాతీయ క్రికెట్ జట్టులో కీలక డేటా, వీడియో అనలిస్ట్‌గా సేవలందిస్తున్నారు. అప్పటి నుంచే యుఎస్‌ఎ క్రికెట్ జట్టు ఐసిసి వరల్డ్ కప్ లీగ్-2లో అగ్రస్థానంలో నిలిచి, 2027 వన్డే వరల్డ్ కప్ అర్హత వైపు దూసుకుపోయింది. సంపత్ విశ్లేషణ సామర్థ్యం, వ్యూహాత్మక సూచనలు కీలకపాత్ర పోషించాయి. అంతర్జాతీయంగా యుఎస్‌ఎ, బర్ముడా, ఇటలీ వంటి జాతీయ జట్లతో పాటు ఫ్రాంచైజీ లీగ్‌లలో కూడా రాణించాడు. రాబిన్ సింగ్, ఓవైస్ షా, కెవిన్ ఓబ్రియన్, జూలియన్ ఉడ్ వంటి అంతర్జాతీయ కోచింగ్ దిగ్గజాలతో కలిసి పనిచేయడం, ఆయనకు మరో స్థాయికి తీసుకెళ్లింది. డేటా ఆధారంగా ఆటతీరు అంచనా వేయడం, ఆటగాళ్లకు వ్యూహాలు సూచించడం, ప్రత్యర్థుల బలాబలాలు విశ్లేషించడం వంటి పనుల్లో సంపత్ నైపుణ్యం అసాధారణమైనదిగా మారింది.

వాల్మీకిపురం పట్టణానికి గర్వకారణం

వాల్మీకిపురం వాసులు సంపత్‌ను గర్వంగా భావిస్తున్నారు. “మన తోటవీధిలో పుట్టిన బిడ్డ ఇప్పుడు అమెరికా జాతీయ జట్టుతో పనిచేస్తున్నాడని వినగానే మాకు ముచ్చటేస్తుందని” అంటున్నారు స్థానికులు. “మా ఇంటి కుర్రవాడు ప్రపంచానికి మార్గదర్శకుడవుతున్నాడు అని చూచినప్పుడు నిజంగా గర్వంగా ఉంది,” అంటూ ఆయన తండ్రి ఆదినారాయణ చెప్పగా, తల్లి విజయలక్ష్మి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

యుఎస్‌ఎ టీంతో వీడియో అనలిస్ట్ సంపత్

అంకితభావానికి ప్రతీక

సంపత్ ప్రయాణం వాల్మీకిపురం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. చిన్న ఊరిలో పుట్టిన ఒక యువకుడు ప్రపంచ క్రికెట్ రంగస్థలంలో ప్రభావితంగా నిలిచాడంటే ఆయన అంకితభావానికి, పట్టుదలకు ప్రతీక.

ఇంకా ఎన్నో విజయాలు అందుకోవాలి

వాల్మీకిపురం నుంచి అంతర్జాతీయ వేదిక వరకూ వచ్చిన ఈ ప్రయాణం నాకు గర్వకారణం. ఇది ముగింపు కాదు ఆరంభం మాత్రమే. ఇంకా ఎంతో నేర్చుకోవాలి, ఎన్నో విజయాలను అందుకోవాలి అంటూ, నిరంతర అభివృద్ధి పట్ల శేషాద్రి సంపత్ తన అంకితభావాన్ని పరోక్షంగా వెల్లడించారు.

ఫ్లాష్..!

ప్రజాదృష్టి

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడంపై మహా నాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వాగ్దానంపై నిరుత్సాహం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట రూ.35 వేల కోట్లతో ప్రయివేటు సంస్థ ఆధ్వ ర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కారు రూ.15 వేల కోట్లతో మూడేళ్లలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేకపోవడం తీవ్ర నిరాశను కలిగించింది. వైఎస్ఆర్ హయాం నుంచి నేటి వరకు ముచ్చటగా మూడు సార్లు శంకుస్థాపన చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనమూ లేకుండా పోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ సర్కారు నాయకత్వం రూ.తొమ్మిది వేల కోట్లతో ప్రయివేటు సంస్థ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసింది. మూడు దఫాలుగా చేస్తున్న వాగ్దానాల్లో వేడి క్రమేణా పరిశ్రమ పరిమాణం తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలో యుపిఎ-2 సర్కారు ఇచ్చిన హామీ ఏమిటి, అనంతరం పాలకులు చేస్తున్న విన్యాసాలేమిటో అర్థం కావడం లేదనే వాదన వినిపిస్తోంది. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే హామీని విస్మరించి, ప్రయివేటు సంస్థల ఆధ్వర్యంలో జూన్ 12న ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది. వైసిపి హయాంలో కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు సొంతంగా అధికారంలోకి రావడంతో బేరమాడే అవకాశం లేదనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పడాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు రాష్ట్రంలోని టిడిపి ఎంపీల మద్దతుపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన హక్కులను, వాటాలను రాబట్టుకోవడంలో ఎన్‌డిఎ సర్కారుకు నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లను ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదనే వాదన విమర్శ వినిపిస్తోంది. ఇద్దరు నాయకుల సమిష్టి వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందనే చర్చ నడుస్తోంది. టిడిపి అధ్యక్షులు, ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు గత పదిహేనేళ్లుగా జిల్లాలో టిడిపికి ఒక్క స్థానమే ఇచ్చారని, పదేపదే ప్రస్తావించిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో ఎన్‌డిఎకు ఏడు స్థానాల్ని ప్రజానీకం కట్టబెట్టింది. చరిత్రలోనే లభించిన అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఎన్‌డిఎ మీనమేషాలు లెక్కిస్తోంది. ఎనోన్న ఆశలు పెంచుకున్న జిల్లా ప్రజానీకాన్ని నిరాదరణకు గురిచేయడం మొదటికే మోసం వస్తుందనే సంగతిని గ్రహించాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2026వ సంవత్సరం వరకు గడువు ఉన్న మందులు

చెత్త కుప్పలో ప్రభుత్వ వైద్యశాల మందులు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం సమీపంలోని చెత్త కుప్పలో ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించిన మందులు శనివారం దర్శనమిచ్చాయి. ఇందులో కాలం చెల్లిన మాత్రలతో పాటు 2026 సంవత్సరం వరకు వరకు గడువు ఉన్న మండులు కూడా ఉన్నారు. ఇలా రోగులకు అందవలసిన మాత్రలు చెత్త కుప్పల పాలు కావడం పై తీవ్ర విమర్శలు వెళ్ల వెత్తుతున్నాయి. ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి మాత్రలు పడేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శరత్ కమల్‌ని వివరణ కోరగా పిహెచ్‌సికి గత మూడు సంవత్సరాల నుంచి స్టాక్ ను చెక్ చేయగా ఆ మందులు మా పిహెచ్‌సికి సంబంధించిన కాదని అన్నారు. నందలూరు, నాగిరెడ్డి పల్లెకు సంబంధించిన సిబ్బందిని పూర్తిగా విచారించగా ఆ మందులు తమవి కాదని తెలిపారు.

ప్రేమాలయంలో అన్నదాన కార్యక్రమంలో దాతలు, లయన్స్‌క్లబ్ సభ్యులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామపురం

అన్నదానం గొప్పదని రాయచోటి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి పేర్కొన్నారు. మండలంలో బండపల్లి పంచాయతీలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శనివారం గాలివీడు మండలం నూలివీడు గ్రామానికి చెందిన దేరంగుల సుజాత తన భర్త దేరంగుల రామకృష్ణ జ్ఞాపకార్థం ప్రేమాలయంలోని వృద్ధులకు తన కుమార్తె చైత్ర శ్రీ ఆర్థిక సాయంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమవంతుగా వృద్ధులకు అన్నదానం చేయడానికి తోడ్పడిన లయన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబంలో ఎలాంటి వేడుకలు కార్యక్రమాలు జరిగినా నలుగురికిఉపయోగపడే పనులు చేస్తామని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతల , కుటుంబ సభ్యులు, ప్రేమాలయం సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** సమాజ సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షులు తగాది రాజశేఖర్ పిలుపునిచ్చారు.తన భార్య సాయిపల్లవి పుట్టినరోజుని పురస్కరించుకొని బెంగుళూరు నగరం,హెూసకోట వద్దగల విజన్ ఇండియా ఆశ్రమంలోని వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా తగాది రాజశేఖర్ భార్య సాయిపల్లవి మాట్లాడుతూ తన భర్త ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలకు, పౌండేషన్ సభ్యుల అందిస్తున్న సహాయ, సహకారాలను అభినందించారు.

కొత్త పింఛన్ల ఊసే లేదు

ప్రజాశక్తి-కలికిరి

ఎన్నికలు ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్ల ఊసే లేదని పీలేరు నియోజకవర్గం సమాచార హక్కు చట్టం అధ్యక్షులు మద్దిరాళ్ళ మల్లికార్జున అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేని స్థితిలో ఈ ప్రభు త్వం ఉండటం చాలా బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే కొత్త పెన్షన్లు వస్తాయనే ఆశతో ఓట్లు వేసి అందలం ఎక్కిస్తే, పేదవారి ఆశలు అడియాశలు చేస్తున్నారని అన్నారు. కొత్త పింఛన్ల కోసం అర్హులైన నిరుపేదలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని, ఇకనైనా కొత్త పెన్షన్లు మంజూరు చేసే దిశగా ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో సుగవాసి ప్రసాద్‌బాబు

ప్రజలంతా ప్రశాంతంగా జీవించాలి : 'సుగవాసి'

ప్రజాశక్తి-రామాపురం

ప్రజలంతా ప్రశాంతంగా జీవించాలని టిడిపి పాలకమండలి మాజీ సభ్యులు, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. శనివారం కుమ్మరపల్లె గ్రామం సురకవాండ్లపల్లె సబ్ స్టేషన్ ఎదురుగా శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుర్రాల వెంకటరమణ ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి, శాలువ కప్పి సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈసందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రజలందరు సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకటేసు, మన్నేరు రామాంజనేయులు, పసుపులేటి నాగేంద్ర, మన్నేరు రాజా, మన్నూరు గుణమూర్తి,కొట్టె శేఖర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా కూలీలతో ఎమ్మెల్యే మాటామంతి

ప్రజాశక్తి- బి.కొత్తకోట

నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి మహిళా కూలీలు తారసపడ్డారు. ఆయన కారులో నుంచి దిగి మహిళా కూలీలతో మాట్లాడారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం అధికారం రావడం తథ్యంలో అందరికి అండగా ఉంటామని తెలిపారు. కూలీలు పనులకు కోసం ఒక ప్రాంతం నుంచి మరోక ప్రాంతానికి ఆటోలను ఆశ్రయిస్తారని, ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని సూచించారు. మహిళా కూలీల పట్ల ఆప్యాయతతో రూ.5 ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మహిళా కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

యోగాతో ఆరోగ్యానికి రక్షణ

-కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-నందలూరు

యోగాతో ఆరోగ్యానికి రక్షణ లభిస్తుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ రాధాకృష్ణంరాజు ఆధ్వర్యంలో సౌమ్యనాథస్వామి ఆలయ ఆవరణంలో శనివారం ఉదయం యోగా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమం ద్వారా రోజుకు కేవలం 30 నిమిషాలు యోగా చేస్తే ఆరోగ్యం, శారీరక దృఢత్వం, మానసిక శాంతి సిద్ధిస్తాయని అన్నారు. అనంతరం యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం నిర్వహించి వాటి లాభాలను వివరించారు. మొదట ఉదయం ఆరున్నర గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. రాజంపేట హైదర్‌నగర్‌కు చెందిన న్యాయశాస్త్రం రెండో సంవత్సరం చదువుతున్న ఆర్ఎఇ మహిధ్య వేసిన యోగాసనాలు అందరిని అబ్బురపరిచాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఎఫ్ఒ జగన్నాథ్‌సింగ్, సబ్ డిఎఫ్ఒ సుబ్బరాజు, జిల్లా పర్యాటక అధికారి నాగభూ షణం, డిఆర్‌డిఒ డ్వామా పీడీలు వెంకటరత్నం, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, విద్యుత్ శాఖ ఎస్ఇలు దయాకర్ రెడ్డి, సహదేవరెడ్డి, శ్రీనివాస రెడ్డి, డిఎంహెచ్ఓ ఉషశ్రీ, డిఎస్‌డిఒ గౌస్‌బాషా, పశుసంవర్ధక శాఖ అధికారి, మండల స్పెషల్ అధికారి గుణశేఖర్ పిళ్ళై, తహశీల్దార్ పుల్లారెడ్డి, ఇఒపిఆర్‌డి సునీల్‌కుమార్, ఎంపిడిఒ రాధాకృష్ణంరాజు, మండల అధికారులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

యోగాసనం వేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

కలికిరి : ఉద్యాన వంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రాజానాయక్

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని రాజువారిపల్లెలో కెవికె కలికిరి సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభయాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ రాజానాయక్ కలికిరి ప్రాంతంలో రైతులు షేడ్ నెట్ నిర్మించి ఆర్కిడ్, హెలికోనియా పూల మొక్కల సాగు చేస్తున్నారని తెలిపారు. పూల సాగును ఎలాచేయాలి, మార్కెటింగ్ వివరాల గురించి రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. బంతి, చైనా ఆస్టర్ పూల సాగు ఆగస్టు, సెప్టెంబర్ నెలలో సాగు చేసి ఆదాయం పొందవచ్చునని అన్నా రు. వర్మీ వాష్, వేప పిండి వంటి వాటిని పంటలలో ఉపయోగించే విధానం గురించి తెలియజేసినట్లు చెప్పారు. గిరినాథ్ రెడ్డి పశువైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మినీ గోకులం, షెడ్లు, దాణా పై రాయితీలను వివరించారు. పశుపోషణలో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులను, దాణా తయారీని వివరించారు. పశువుల్లో వస్తున్నటువంటి సమస్యలైనా కట్టు సమస్య, నులిపురుగులు, పిడుదులు, పొదుగు వాపు నివారణ గురించి తెలిపారు. పీలేరు ఉద్యాన అధికారి సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు అయిన ఫ్రూట్ కవర్స్ ప్యాక్ హౌస్, పూల తోటల పెంపకం, ఫారం పాండ్లు ఇతర వాటి గురించి తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి వారి ఆధ్వర్యంలో మండంలోని పనసమాకులపల్లెలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి సమన్వయకర్త డా కె.మంజుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యకమంలో ఉద్యాన శాస్త్ర వేత్త, కెవికె కలికిరి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ టమోటా పంటలో ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని నియంత్రించి, సూచించిన మోతాదులో వాడాలన్నారు. రైతులు సూక్ష్మ పోషకాలు వాడకాన్ని టమోటా నాటిన ప్రతి 30, 60, 90, 120 వ రోజులలో లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున పిచికారి చేయాలని తెలిపారు.ార్యక్రమంలో డాక్టర్ కె.మాధురి, టిడిపినాయకులు బీదం గురునాథ్‌యాదవ్, జీవి నాయుడు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి : ఎఒ

కలకడ : ఖరీఫ్ సాగు చేసే పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.వి.లావణ్య తెలిపారు. మండలంలోని కదిరాయ చెరువు పంచాయతీలో కలికిరి కెవికె సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల ఆధ్వర్యంలో ఖరీఫ్ పంటలు వేయగల రైతులకు అవగాహన సదస్సును నిర్వహించడం జరిగిందన్నారు. తిరుపతి పట్టణానికి చెందిన వ్యవసాయ పరిశోధకులు డాక్టర్ పి.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వేరుశనగలు తుంగ కలుపు నివారణకు డైట్‌లో సులాఫ్ 12 గ్రాములు 1200 లీటర్లనీటిలో కలిపి ఎకరా పొలంలో వేరుశనగ విత్తనలకు పిచికారి చేయాలని సూచించినట్లు తెలిపారు. వివిధ పంటల్లో డ్రోన్ వాడకం నీరు మోతాదు పిచికారి చేసే మందు మోతాదు ఏ పంటలో వాడవ వచ్చును తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అందిస్తున్న అందిస్తున్న పథకాలను గురించి వివరించామన్నారు. డ్రోన్ కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తున్నటువంటి రాయితీ గురించి కూడా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కమలనాథ, గోపాల్ నాయుడు, విశ్వనాథ శెట్టి, గ్రామ వ్యవసాయ సేవ అధికారులు శరత్, రవి, రెడ్డి కుమార్, రైతులు పాల్గొన్నారు.

కలకడ : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి

కలకడ : ఎఒ శ్రీమతిని సన్మానిస్తున్న ఎంపిడిఒ, సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి-రామాపురం

ఉద్యోగంలో చేరిన ప్రతి వ్యక్తికి ఉద్యోగ విరమణ తప్పనిసరని తహశీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి విఆర్ఒ వెంకట సుబ్బారెడ్డి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వెంకటసుబ్బారెడ్డి దంపతులను గ్రామ టిడిపి నాయకులు రామాం జనేయులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పేదలు, ధనికులు రాజకీ య నాయకులు అని బేధం లేకుండా ప్రతి ఒక్కరికి తన పరిధిలోని పనులను చేసి గ్రామస్తుల మనలను పొందాలని తెలిపారు. వెంకటసుబ్బారెడ్డి శేష జీవితం ఆయు రారో గ్యాలతో గడపాలని వారు ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రాచపల్లి ప్రజలు పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్ర మైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎఒ శ్రీమతి ఉద్యోగ విరమణ చెందారు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండలంలో గత కొన్ని నెలలుగా విధులు నిర్వహి న్నారు. ఉద్యోగ విరమణ చెందడంతో ఎంపిడిఒ, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది ఆమెను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరిం చారు. మండలానికి ఆమె చేసిన సేవలు అభినంద నీయమని కొనియాడారు. ఇలాంటి అధికారి ఉద్యోగ విరమణ పొందడం బాధాకర మని ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. కార్యక్రమంలో సిఎ ప్రతాప్‌రెడ్డి, జెఎ మహబూబ్ బాషా, టైపిస్టు శివసాయి గణేష్, ఎపిఒ సుజాత, కార్యాలయ సిబ్బంది ప్రభావతి, చంద్రనాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు భరోసాగా సామాజిక పింఛన్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, వితంతువులకు భరోసాగా ఉండేందుకే ఎన్‌టిఆర్ సామాజిక పెన్షన్లను కూటమి ప్రభుత్వం ప్రతినెల 1వ తేదీన క్రమం తప్పకుండా పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. అన్నారు. శనివారం పట్టణంలోని బాబు కాలనీ, కొత్త గొల్లపల్లి రామారావు కాలనీ, బాపూజీ పార్క్, రెడ్డప్ప నాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని కొత్తవారిపల్లి, రెడ్డివారిపల్లి, తట్టివారిపల్లి, గొల్లపల్లి, గుడిసివారిపల్లి, దుబ్బిగానిపల్లి, సిటిఎం క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాల్లోనూ వృద్ధులకు పింఛన్లు అందించారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్ ఇవ్వడం కూటమి ప్రభుత్వం ప్రత్యేకత అన్నారు.కార్యక్రమంలో తెలుగుదేశం నాయ కులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ :** ఒకరోజు ముందే పింఛన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలి పారు. మండలంలో ఉన్న విభిన్న ప్రతిభా వంతులు, వితంతువులు, వృద్ధుల కు ఇవ్వవలసిన పింఛన్లను పంపిణీ చేసి నట్లు తెలిపారు. 1న ఆదివారం రావడంతో ఒక రోజు ముందే పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సాయంత్రం వరకు మండలంలో 93.40 శాతం పింఛన్లను పంపిణీ చేసి నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు

వాల్మీకిపురం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పజాశక్తి-వాల్మీకిపురం

పొగాకు ద్వారా ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని ప్రజలు గమనించి వాటికి దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి సోని అన్నారు. పొగాకు వ్యతిరేఖ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రి వద్ద నుంచి ప్లకార్డులతో గాంధీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగతాగడం వలన స్వరపేటిక, నాలుక, గొంతు, ఆహారనాళం దెబ్బతినడంతో పాటూ ఊపిరితిత్తులలో కేన్సర్ వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పొగతాగేవారికంటే పీల్చేవారిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. పొగాకును వాడనీయం.. వ్యాధులను దరి చేరనీయం అంటూ వైద్య సిబ్బం దిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్లు శివాని, ఆసిఫ్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి పాల్గొన్నారు. **మదనపల్లె :** పట్టణ సమీ పంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పొగాకు రహిత దినో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాల ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా ర్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ పొగాకు వల్ల కలిగే ఆరోగ్య హానులపై అవగాహన పెంచడం, విద్యార్థులు సమాజాన్ని పొగాకు రహిత జీవనశైలి వైపు దారితీయడం ఈ దినోత్సవ ఉద్దే శ్యమని పేర్కొన్నారు. పొగాకు వాడకం యువత గ్యాన్ని బలహీన పరు స్తోందని, సిగరెట్ తాగడం, పొగాకు నమలడం రెండూ ప్రాణాంతకమని అన్నారు. ఊపిరితిత్తులు, నోరు, గొంతు సహా శరీరంలోని ప్రతికణంపై పొగా కు దుష్ప్రభావం చూపుతుందన్నారు. కేన్సర వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడి జీవితాలు దుర్భరమవుతాయని అన్నారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. పోగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లకుండా మంచి అలవాట్లు అలవర్చు కోవాలన్నారు. పోగాకు నియంత్రకు యువత కూడా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

వాహనాల రద్దీతో నిండిపోయిన బస్టాండ్

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలో గేటు వద్ద నాలుగు రోడ్ల కూడలి బస్టాండ్ వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు పేర్కొన్నారు. బస్టాండ్ వద్ద బస్సులను తిప్పుకునేందుకు కూడా వీలు లేకుండా ఉండటంతో డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపివేయడం ద్వారా ట్రాఫిక్ సమస్య పెరిగిపోందని అన్నారు.స్థానిక పోలీసులు దృష్టి సారించి గేటు, బస్టాండ్ వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీ

మండల పరిధిలోని రెడ్డిపల్లి దళితవాడకు చెందిన బొమ్మవరం వెంకటయ్య(70) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రొంపి చర్ల మురళీ మృతుడి కుటుం బానికి రూ.20 వేలు దహన సం స్కారాల కోసం అందించారు. ఈ సందర్భంగా ఆయన వెంకటయ్య కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఓదార్చారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసానిచ్చారు. ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తామని చెప్పారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత హామీల అమలులో చేతులెత్తేసిందని ఎమ్మెల్యే ద్వారకనాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 4వ తేదీన నియోజకవర్గంలో నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలనిపిలుపునిచ్చారు.ఇందులో భాగంగా శనివారం మదనపల్లి పట్టణం, బసినికొండ వద్ద గల వైసిపి కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి సర్కార్, ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఆర్.సి ఈశ్వర్‌రెడ్డి, దేవిరెడ్డి పద్మజారెడ్డి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లి

అనారోగ్యంతో మంచాన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. బాధితులకు అండగా ఉంటూ వారి ఆరోగ్యం కోసం సిఎం ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు తెలిపారు.శనివారం ఈశ్వరమ్మ కాలనీ, బాబు కాలనీ లోని బాధితుల ఇంటికి నేరుగా వెళ్లి కలుసుకొని వారికి రూ.1.10లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాలకు తోరణాలు కట్టొద్దు

- రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఇమ్మానియేల్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పార్టీ తోరణాలు కట్టవద్దని రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఇమ్మానియేల్ సూచించారు. రాష్ట్ర కార్యాలయంలో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు అరికట్టాలన్నారు. దళితులపై అధికారుల వేధింపులు, దాడులు ఆపడానికి వెంటనే కఠిన చట్టం తేవాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రతినెల ఆర్‌డిఒ సమక్షంలో దళితవాడల్లో అవగాహన సదస్సు నిర్వహిం చాలన్నారు. రాజ్యాంగం కల్పించిన దళితులకు సాగుభూమిని వెంటనే కల్పిం చాలన్నారు. రాష్ట్రంలో దళితుల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ 4 అమలు చేయా లన్నారు. ప్రాణహాని ఉన్న దళిత నాయకులకు వెంటనే రక్షణ కల్పిం చాల న్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో కౌంటర్ కేసులు నమోదు చేయ కూడదన్నారు. పోలీస్‌స్టేషన్లో దళితులకు సమాన హక్కు కల్పిం చాలన్నారు. రాజ్యాంగంలో దళితులకు కేటాయించిన రిజర్వేషన్లను తప్పకుండా అమలు చేసి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపాక వినోద్ కుమార్, కమిటీ సభ్యులు రాష్ట్ర మాల మహానాడు గౌరవ అధ్యక్షులు సుద్దపల్లి మురళీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గున్నంపాటి వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెళ్లికట్ల సాగర్, జిల్లా నాయకులు మేకల ఓబులేసు, సంగటి పుల్లయ్య, కిరణ్, అరుణ్, ప్రణయ్ పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం పులివెందుల శ్రీరాజా కళానిలయం డాన్స్ అకాడమీ చిన్నారులచే శాస్త్రీయ, జానపద, సినీ నృత్య ప్రదర్శన ఉంటుందని శిల్పారామం పరిపాలన అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు విరివిగా పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సామాజిక న్యాయంపై టిడిపి గొప్పలు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

సామాజిక న్యాయంపై టిడిపి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టక ముందే, చంద్రబాబు రాజకీయాలలోకి రాకముందే కాంగ్రెస్ పార్టీ విద్య, ఉద్యోగాలలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు కాంగ్రెస్ చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు పుట్టకముందే 1970లోనే బిసిలకు విద్య, ఉద్యోగాలలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. స్థానిక సంస్థలలో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీ కల్పించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో అమలు చేసిన సామాజిక న్యాయం అనే అంశాన్ని టిడిపి మహానాడులో ఆరు శాసనాలలో పెట్టడం విడ్డూర మని తులసిరెడ్డి విమర్శించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన శనివారం తంబళ్లపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ లోకేష్‌రెడ్డి కథనం మేరకు. .బాలిరెడ్డిగారిపల్లికి చెందిన అమర్నాథ్ రెడ్డి ద్విచక్రవాహనంలో వెళుతుండగా తంబళ్లపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. గమనించిన స్థానికులు బాదితుడిని వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి తరలించారని అన్నారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగ ళూరుకు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.